ప్రకృతి ప్రణమిల్లే.. నిమ్మ పరిఢవిల్లే!

అనుకూలించిన ప్రకృతి.. పెరిగిన భూగర్భజలాలు.. అన్నదాత చెంతకు చేరిన (తెలుగు)గంగ.. ఏడాది పొడవున గిట్టుబాటు ధర..వెరసి సైదాపురం మండలంలో నిమ్మసాగు పరిఢవిల్లుతోంది. ఫలితంగా కర్షకుడు ఖుషీగా ఉన్నాడు.

- మూడేళ్లుగా ఏటా పెరుగుతున్న నిమ్మ సాగు
- గిట్టుబాటు ధర.. అధిక రాబడి


సైదాపురం మండలంలో సాగు చేసిన నిమ్మ తోట

సైదాపురం: మండలంలో ఏటా నిమ్మసాగు పెరుగుతోంది. ప్రస్తుతం సుమారు 7,500 ఎకరాల్లో నిమ్మ సాగు చేస్తున్నారు. మరో వెయ్యి ఎకరాల్లో నిమ్మ సాగు చేసేందుకు రైతు సన్నద్ధమవుతున్నారు. గతంలో నిమ్మ తోటల సాగు చేసే రైతులు నష్టాలను చవిచూసే వారు. ఇందుకు ముఖ్య కారణం కరువు. కరువుకాలంలో సాగునీటికే రూ.లక్షలు ధారబోయాల్సి వచ్చేది. అయినా నిమ్మ తోటలు ఎండిపోయి వంట చెరుకుగా అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఉండేవి. అయితే మూడేళ్లగా పుష్కలంగా వర్షాలు కురుస్తుండడంతో భూగర్భజలాలు పెరిగి, సాగునీటి కొరత తీరడంతోపాటు మార్కెట్‌లో నిమ్మకు మంచి డిమాండ్ ఉండడంతో నిమ్మ రైతులకు కాలం కలిసొచ్చిందని చెప్పుకోవచ్చు. ఈ నేపథ్యంలోనే నిమ్మసాగు పెరుగుతోంది.

3 వేల హెక్టార్లలో సాగు

మండలంలో అధిక శాతం మంది రైతులు నిమ్మ సాగుపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సుమారు 3 వేల హెక్టార్ల మేరకు నిమ్మ సాగులో ఉంది. ఈ ఏడాది మరో వెయ్యి ఎకరాల్లో నిమ్మసాగును చేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. మండలంలోని ప్రతి రైతూ 50 నుంచి 5 వేల మొక్కల వరకు నిమ్మ సాగు చేస్తుంటారు. దాదాపు 70 శాతం భూముల్లో నిమ్మ చెట్లే కన్పిస్తాయి. మండలంలో తెలుగుగంగ బ్రాంచ్‌కెనాల్–2 నుంచి నీరు రావడంతోపాటు మూడేళ్లుగా నిమ్మకు మంచి ధరలు వస్తుండడంతో రైతులు సాగుపై మొగ్గు చూపుతున్నారు.

ఆశాజనకంగా నిమ్మ ధరలు

సాధారణంగా నిమ్మకు ఏడాదిలో ఒక సీజన్‌లోనైనా మంచి ధర లభిస్తే చాలు అనుకునేవారు రైతులు. అలాంటిది ఈ ఏడాది సీజన్‌తో సంబంధం లేకుండా మంచి ధర పలుకుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో బస్తా కాయలు (50కిలోలు) రూ.200 నుంచి రూ.400 కూడా పలికేవి కావు. అలాంటిదీ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి 50 కిలోల బస్తా రూ.8 వేలు నుంచి రూ.11 వేలు పలికింది. ప్రస్తుతం ఆన్ సీజన్‌లో కూడా బస్తా రూ. వెయ్యి నుంచి రూ.2 వేలు వరకు పలుకుతుంది.


మందు పిచికారి చేస్తున్న మహిళ కూలీ

దీంతో ఎకరా నిమ్మ సాగు చేస్తున్న రైతులకు ఖర్చులు పోనూ రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు నికర ఆదాయం వస్తోంది.

నిమ్మసాగు బాగుంది



భూగర్భజలాలు పెరగడంతో సాగునీరు కొరత తీరింది. అలాగే ఏడాది పొడవునా మార్కెట్‌లో నిమ్మ ధరలు రికార్డు స్థాయిలో పలుకుతున్నాయి. ఒకానొక దశలో 50 కిలోల బస్తా రూ.22 వేలు ధర పలికింది. నా జీవితంలో ఎప్పుడు ఈ ధర చూడలేదు.

– గుంటమడుగు శ్రీనివాసులురాజు, రైతు, ఆర్‌వైజీపాళెం

కనీవినీ ఎరుగని రీతిలో ధరలు



నేను ఐదు ఎకరాల్లో 10 ఏళ్లుగా నిమ్మ సాగు చేస్తున్నాను. ఏడాది పొడవునా ధరలు లభించలేదు. అప్పట్లో ధరలు లేక ఏడాది పొడవునా ఒకటి రెండుసార్లు కూడా కాయలు కోయకుండానే చెట్లలోనే వదిలివేసే వాళ్లం. ఈ ఏడాది ఆ పరిస్థితి లేదు. కనీవినీ ఎరుగని రీతిలో ధరలు ఉన్నాయి.

– మందపాటి ఆదిశేషయ్యనాయుడు, రైతు

సాగు విస్తీర్ణం పెరుగుతోంది



గతంలో ఎన్నడూ లేని విధంగా ఏడాది పొడవునా నిమ్మ ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. మూడేళ్ల నుంచి నిమ్మ తోటల సాగు విస్తీర్ణం పెరుగుతోంది. రైతులకు విరివిగా వివిధ పథకాల ద్వారా రాయితీలను ప్రభుత్వం అందిస్తోంది. ఈ నేపథ్యంలోనే రైతులు నిమ్మసాగుపై మొగ్గుచూపుతున్నారు.

–ఆనంద్, ఉద్యానశాఖ అధికారి, సైదాపురం

క్లుప్తంగా

పోషకాహారంపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న అధ్యాపకుడు ప్రవీణ్‌గురు

గూడూరురూరల్: మండలంలోని విందూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, బాలికల జూనియర్ కళాశాలలో గురువారం పౌరశాస్త్ర అధ్యాపకులు ప్రవీణ్‌గురు ఆధ్వర్యంలో పోషకాహారం, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వెంకటనాగ మల్లికార్జునరావు మాట్లాడుతూ విద్యార్థులు చిరుధాన్యాలు, తృణధాన్యాలు తినాలని సూచించారు. అనంతరం ప్రవీణ్‌గురు మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యం, పౌష్టికాహారంపై దృష్టి సారించాలని కోరారు. అనంతరం పదో తరగతి విద్యార్థినులు సమతుల ఆహారంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

లక్ష్మీనరసింహుడి సేవలో అంజూరు


అంజూరుకు శ్రీవారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామి వారిని శనివారం శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు కుటుంబసభ్యులతో కలసి దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం సిబ్బంది స్వాగతం పలికి మూడు ఆలయాల్లో దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థ ప్రసాదాలు, వేదపండితుల ఆశీర్వచనాలు, శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు.

పంట పొలాల్లో గూడబాతు


పంట పొలాల్లో ఉన్న గూడబాతు

దొరవారిసత్రం: వయస్సు మీద పడి ఎగరలేక ఓ గూడబాతు వెదురుపట్టు గ్రామానికి వెళ్లే మార్గంలోని పంట పొలాల్లో గురువారం దర్శనమిచ్చింది. దీన్ని గుర్తించిన కొందరు దాన్ని తరమినా వెళ్లకుండా అక్కడే ఉండింది. ఈ విషయాన్ని నేలపట్టు పక్షుల కేంద్రంలోని వన్యప్రాణి విభాగం అధికారుల సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న ఎఫ్ఎస్‌ఓ బాలయ్య, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని, ఆ బాతును పట్టుకుని పక్షుల కేంద్రంలో వదిలిపెట్టేందుకు ప్రయత్నం చేశారు. కాని అతి కష్టం మీద గూడబాతు ఎగిరివెళ్లింది. వయస్సు మీద పడిన గూడబాతులు అప్పుడప్పుడు ఎగురలేక ఉండిపోతాయని సంబంధిత అధికారులు తెలిపారు.

భూములకు హక్కులు కల్పించాలి

దక్కిలి: మండలంలోని పలుగోడులో ఉన్న అటవీ భూములను ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న అర్హులైన గిరిజనులు సాగు హక్కులు కల్పించాలని గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య, తిరుపతి జిల్లా అధ్యక్షుడు మల్లికార్జునరావు కోరారు. గురువారం పలుగోడులో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములు వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలుగోడులో గిరిజనులు సాగు చేస్తున్న అటవీ భూముల వద్దకు వారు వెళ్లగా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షే సంఘం నాయకులు సీ ఉష, వరలక్ష్మి, మల్లి, రవీంద్ర, రమేష్, శీనయ్య, పోలయ్య, రవి, ప్రభావతి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 11.353 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 11.353 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిస్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎంపీటీసీ సభ్యురాలికి ఎమ్మెల్యే కిలివేటి పరామర్శ


ఎంపీటీసీ సభ్యురాలు నరసమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేటటౌన్: మండలంలోని పుదూరు ఎంపీటీసీ సభ్యురాలు కంచి నరసమ్మ కుటుంబ సభ్యులను గురువారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి పరామర్శించారు. నరసమ్మ భర్త, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కంచి దయానందం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కుప్పరగుంటలోని మృతుడు దయానందం ఇంటి వద్దకు ఎమ్మెల్యే వెళ్లి, పరామర్శించి వారికి ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉండే దయానందం మృతి పార్టీకి తీరని లోటన్నారు. వారి కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ టీ సుబ్రహ్మణ్యం రెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి, నాయకులు వీ లక్ష్మీనారాయణ రెడ్డి, పీ హరినాథ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అయ్యప్పస్వామి సేవలో నేదురుమల్లి

వెంకటగిరిరూరల్: పట్టణంలోని కుమ్మరిగుంటలో ఉన్న అయ్యప్పస్వామి దేవస్థానంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్పస్వామి మాలధారణ చేసిన భక్తులకు ఆలయం కమిటీ ఆధ్వర్యంలో భిక్ష (విందు) కార్యక్రమం నిర్వహించారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులకు స్వయంగా వడ్డించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్ సురేష్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య, ఆలయ కమిటీ చైర్మన్ వీ మధునాయుడు, కార్యదర్శి గురునాథం, జీ శ్రీనివాసులు, ఎస్ రాజగోపాల్, బీ రవికుమార్, కె ధర్మయ్య, నాయకులు టీ గణేష్‌రెడ్డి, పేజీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే చేయాలి


మాట్లాడుతున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

చిట్టమూరు: బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటరు సర్వే చేయాలని గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. మండలం పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని బీఎల్వోలతో సమీక్ష సమావేశం, ఓటర్ల నమోదుపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి బీఎల్వో సమావేశానికి తప్పక హాజరు కావాలన్నారు. అలా కానీ పక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బీఎల్వోలందరూ ఫారం, 66 ఏ,7, 8, 8ఏపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. జనవరి ఒకటో తేదీనాటికి 18 ఏళ్ల నిండిన వారికి అప్పటికప్పుడే ఓటు నమోదు చేయాలని తెలిపారు. మృతి చెందిన ఓటర్లు, గ్రామాలను వదలి వెళ్లిన వారి ఓటు హక్కును ఫారం–7లో చూపించాలన్నారు. పురుషులు, స్త్రీలు, ఇతరుల ఓట్లను ఎలా నమోదు చేయాలనే విషయాలపై కచ్చితమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ షాల్ట్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు కల్పించండి


మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రముని

సూళ్లూరుపేట: మండలంలో 18 ఏళ్లు నిండిన యువతీ యువకులందరికీ ఓటు హక్కు కల్పించాలని, ఆ బాధ్యత ఆయా పోలింగ్ బూత్ అధికార్లదేనని ఆర్డీఓ చంద్రముని తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాలకు చెందిన బూత్‌స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు పూర్తయిన ప్రతి ఒక్కరిని గుర్తించి ఫారం–6 ఇచ్చి ఓటు నమోదు చేయించేలా చూడాలన్నారు. 17 ఏళ్లు నిండి, 18 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న వారిని ప్రాస్‌పెక్టివ్ ఎలక్టర్‌గా చేర్చాలని సూచించారు. చనిపోయిన, ఊర్లు వదిలివెళ్లిన, పెళ్లి చేసుకుని వెళ్లిన వారి ఓట్లు ఫారం–7 ద్వారా తొలగించాలన్నారు. ఈ నెల 4, 5 తేదీల్లో, డిసెంబర్ 2, 3 తేదీల్లో బీఎల్‌ఓలు పోలింగ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు ఓటర్లుకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. తహసీల్దార్ కే రవి కుమార్ పాల్గొన్నారు.

రూ.60 లక్షలతో సీసీ రోడ్లు

దొరవారిసత్రం: మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద రూ.60 లక్షల నిధులు మంజూరైనట్లు ఎంపీపీ సుజాతమ్మ, వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిమ్మనాయుడుకండ్రిగలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు, ఆనేపూడి రూ.10 లక్షలు, నేలపట్టు ఎస్టీ కాలనీ రూ.5 లక్షలు, నెలబల్లి ఎస్టీ కాలనీలో రెండు పనులకు రూ.15 లక్షలు, నెలబల్లి రూ. 10 లక్షలు, ఏకొల్లులో రూ.10 లక్షలు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు.

మహిళలకు ఉచిత శిక్షణ

పెళ్లకూరు: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు బ్యూటీ పార్లర్‌పై ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు గురువారం ఎంపీడీఓ సురేష్‌బాబు తెలిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి 30 రోజుల పాటు అందిస్తున్న శిక్షణకు పదో తరగతి చదివిన 19 నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, నాలుగు పాస్‌పోర్టు ఫొటోలతో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 79896 80587, 94949 51289, 63017 17672 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బీఎల్వోలతో సమీక్ష

వాకాడు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ గురువారం బీఎల్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాలో ఎటువంటి లోటుపాట్లకు అవకాశం లేకుండా రూపొందించాలన్నారు. రానున్న ఎన్నికల దృష్ట్యా బీఎల్వోలు అప్రమత్తంగా పనిచేయాలన్నారు. అనంతరం సాదాబైనామా భూములపై అధికారులతో సమీక్ష జరిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహారావు, డీటీ సారంగపాణి పాల్గొన్నారు.

పది లారీల పట్టివేత

చిల్లకూరు: అనుమతులు లేకుండా తెల్లరాయి తరలిస్తున్న పది లారీలను పట్టుకుని చిల్లకూరు పోలీసులకు గురువారం అప్పగించారు. ఇటీవల ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా తెల్లరాయిని తవ్వి, తరలిస్తున్నారన్న సమాచారం అందింది. దీనిపై స్పందించిన జాతీయ రహదారిపై నిఘా పెట్టి, మైనింగ్ అధికారులు పది లారీలను సీజ్ చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

దొరవారిసత్రం: మోటార్‌సైకిల్‌కు అడ్డుగా వచ్చిన ఓమహిళను తప్పించే ప్రయత్నంలో వాహనం అదుపుతప్పి రైల్వే ఉద్యోగి పెంచలయ్య గాయపడిన ఘటన గురువారం మావిళ్లపాడు సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. సూళ్లూరుపేటకు చెందిన పెంచలయ్య రోజూలానే డీవీ సత్రం రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వహించేందుకు వస్తున్న సమయంలో మార్గం మధ్యలోని మావిళ్లపాడు సమీపంలో జాతీయ రహదారిలో వెళుతుండగా ఓ మహిళ రోడ్డుకు అడ్డంగా రావడంతో ఆమెను తప్పించే ప్రయత్నంలో బైక్ అదుపుతప్పి పడ్డాడు. ఈ ప్రమాదంలో పెంచలయ్య గాయపడడంతో స్వర్ణటోల్‌వే అంబులెన్స్‌లో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరురూరల్: వైఎస్సార్ సీపీపై గానీ, నాయకులపై గానీ టీడీపీ వారు అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు హెచ్చరించారు. ఎమ్మెల్యే నివాసంలో గురువారం వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మాట్లాడుతూ స్కిల్ స్కామ్ కేసులో తప్పు చేసి జైలు కెళ్లిన చంద్రబాబు ఆరోగ్యం బాగాలేదనే సాకుతో కండిషన్ బెయిల్‌పై విడుదలైతే టీడీపీ వారు సంబరాలు చేసుకోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు రాజకీయ భిక్షపెట్టి, ఎమ్మెల్యేగా చేసిన తల్లిలాంటి వైఎస్సార్‌సీపీని దూషించడం తల్లిపాలు తాగి రొమ్ముగుద్దడం లాంటిదేనన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బీ విజయకుమార్, పట్టణ అధ్యక్షుడు బీ శ్రీనివాసులు, జేసీఎస్ మండల కన్వీనర్లు రాఘవరెడ్డి, శ్రీహరి, బీసీ నాయకులు మహేంద్రయాదవ్, బీ గోపీయాదవ్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు నరసయ్య, కృష్ణయ్య, ఎం చంద్రమోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు బీ వెంకటేశ్వర్లు, ఈ శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల చించివేతపై స్పందించిన ఎమ్మెల్యే, నాయకులు

గూడూరులోని ఎమ్మెల్యే నివాసం వద్ద బుధవారం రాత్రి జరిగిన ఫ్లెక్సీల చించివేత ఘటనపై ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు స్పందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఘటన జరిగిన వెంటనే డీఎస్పీ, పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. ఫ్లెక్సీలను చించివేసి వీరంగం సృష్టించిన యువకుడు సొసైటీ ప్రాంతానికి చెందిన మతిస్థిమితం లేని వ్యక్తిగా తెలిసిందన్నారు.

నవరత్నాలతో నవశకం


సంక్షేమపథకాలపై అవగాహన కల్పిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలతో రాష్ట్రంలో నవశకం తీసుకువచ్చారని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కాలేజీమిట్ట, అమ్మవారిపేటలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడప గడపకు వెళ్లి, ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద, వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య, కౌన్సిలర్లు ఎస్ శేఖర్, ప్రముఖ న్యాయవాది ఎల్ కోటేశ్వరావు, నేతలు డీ బాలకృష్ణ, టీ మల్లికార్జున్, రాజేశ్వరి, పీఏసీఎస్ అధ్యక్షులు జి శ్రీనివాసులు, సీ మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా ప్రగతి వెలుగులు


లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి

సైదాపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా ప్రగతి వెలుగులు విరబూస్తున్నాయని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సైదాపురం మండలంలోని మలిచేడు, కలిచేడు గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానికులు నేదురుమల్లికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎం రవికుమార్, పార్టీ కార్యవర్గ సభ్యుడు వి.ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు శివకుమార్, నేతలు ఎస్ రామ్‌గోపాల్‌రెడ్డి, జీ వీరాస్వామి, ఎం వీరాస్వామి, మణి, శ్రీనివాసులు, వెంకటరత్నయ్య, అబ్బిరాజు, సుబ్బారెడ్డి, చంద్రారెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరిస్తాం


తాగునీటి సమస్యపై ఆరా తీస్తున్న డీఎల్‌పీఓ, ఎంపీడీఓ

చిల్లకూరు: మండలంలోని బూదనం పంచాయతీ పత్రగుంట కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యకు పరిష్కరిస్తామని డీఎల్‌పీఓ వెంకటరమణ తెలిపారు. మండలంలోని బూదనం పంచాయతీ పత్రగుంట వాసులకు తాగునీరు సరఫరా కావడం లేదని రెండు రోజుల క్రితం గ్రామస్తులు డీఎల్‌పీఓ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన, ఇన్‌చార్జి ఎంపీడీఓ గోపినాథ్‌తో కలసి గ్రామంలోని తాగునీటి పథకాన్ని గురువారం పరిశీలించారు. అనంతరం నీటిని సరఫరా చేసే వారిని సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. మోటారు నుంచి వెళ్లే పైపులైన్ పూర్తిగా ఒక వైపునకే ఉన్నందున ఎగువ ప్రాంతంలోని పత్రగుంటకు నీరు సరఫరా చేయలేక పోతున్నామని తెలిపారు. దీంతో పైపులైను మార్చి నీటిని సరఫరా చేసేందుకు అవసరమైన నిధులను మండలం ద్వారా అందించేలా చూస్తామని ఎంపీడీఓ తెలిపారు. రెండు రోజుల్లో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయకుమార్ ద్వారా నివేదికలను తయారు చేయించి, పనులు ప్రారంభిస్తామని తెలిపారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎం శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

జయప్రదం చేయండి

గూడూరురూరల్: హైదరాబాద్‌లో ఈ నెల 11వ తేదీన జరగనున్న మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంద పెంచలయ్య పిలుపునిచ్చారు. గూడూరు అరుంధతిపాళెంలో గురువారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు హరిబాబు, జీ శ్రీను, సుబ్బరామయ్య, రమణయ్య, శ్రీకాంత్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.